క్లుప్తంగా

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ సురేష్

చీరాల టౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల కోసం గుంటూరు జిల్లా ఒట్టిచెరుకూరు నుంచి చీరాల మండల తహసీల్దార్‌గా వచ్చిన కె.నాసరయ్య గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చీరాల తహసీల్దార్ బాధ్యతల నుంచి మంగళవారం రిలీవ్ అయిన నాసరయ్య ఇన్‌చార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్‌బాబుకు బాధ్యతలు అప్పగించారు. ఐదు నెలల పాటు తహశీల్దార్‌గా సేవలందించి ఎన్నికల విధులను నిర్వహించి సొంత జిల్లాకు వెళ్తున్న నాసరయ్యను చీరాల ఆర్డీవో జి.సూర్య నారాయణరెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు, వీఆర్వోలు, కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన అంజిరెడ్డి అంత్యక్రియలు


అంజిరెడ్డి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

జె.పంగులూరు: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సమీపం బంధువు, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు భీమనాథం అంజిరెడ్డి అంత్యక్రియలు మంగళవారం కొండమూరు గ్రామంలో జరిగాయి. అంజిరెడ్డి కుమారుడు సుబ్బారెడ్డి తన తండ్రి చితికి నిప్పంటించారు. అంజిరెడ్డి అనారోగ్యంతో ఆదివారం మరణించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆయన మనుమరాలు సాయి శ్వేత అమెరికాలో ఉండటంతో, మంగళవారం కొండమూరు గ్రామం చేరుకున్న అనంతరం అంత్యక్రియలు జరిగాయి. ముందుగా అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. పలువురు నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

పారిశుద్ధ్య పర్యవేక్షణతో వ్యాధులు దూరం


మేదరమెట్ల మిద్దెల దొంకలో ఆయిల్ బాల్స్‌ను చల్లిస్తున్న అధికారులు

మేదరమెట్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటి పరిసరాలను, వీధులను శుభ్రంగా ఉంచుకోకుంటే దోమల ఉధృతి పెరుగుతుందని హెచ్ఈఓ బ్రహ్మానందం హెచ్చరించారు. మేదరమెట్ల మిద్దెలడొంక వీధిలో ఆరోగ్య శాఖ, పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ కాలువల్లో చల్లారు. ఈవో లక్ష్మీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుభద్ర సేవలు ప్రశంసనీయం


సుభద్రను సత్కరిస్తున్న డీటీలు, వీఆర్వోలు

బల్లికురవ: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించటంతోపాటు ఆరు మాసాలుగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సుభద్ర శక్తి వంచనలేకుండ పనిచేశారని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, రీసర్వే టీడీ ప్రహర్ష అన్నారు. ఎన్నికల సందర్భంగా నెల్లూరు జిల్లా నుంచి బల్లికురవ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన యం. సుభద్ర మంగళవారం తిరిగి నెల్లూరు జిల్లాకు వెళ్తుండగా వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి ఏఎస్‌వో ఆర్‌మర్‌నాథ్, వీఆర్‌వోలు వై. శ్రీనివాసరావు, జి. వీరయ్య, అశోక్ చక్రవర్తి, వాసు తదితరులు ఆమె సేవలను కొనియాడారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

దోమకాటుతో తీవ్ర వ్యాధులు

బల్లికురవ: దోమ కాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల జిల్లా మలేరియా అధికారులు ప్రేమ్‌చంద్ ప్రజలకు సూచించారు. మండలంలోని పెద అంబడిపూడిలో 20 రోజులుగా సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకడంతో మంగళవారం గ్రామాన్ని పరిశీలించారు. మురుగునీరు ముందుకు కదలక పోవడంతో వ్యాధులు సోకుతున్నాయని ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సర్పంచ్, సెక్రటరీలు సూచించారు. వ్యాధులు సోకకుండా వాడని ఖాళీతొట్లు, రోళ్లు, బోర్లించాలని వీటి ద్వారానే లార్వా ఉత్పత్తి అవుతుందని చెప్పారు. జ్వర పీడితులు ఉంటే రక్త నమూనాలు సేకరించాలని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల ల్యాబ్‌కు పంపినట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహమ్మద్, జి. రవితేజ వివరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శేషగిరి పాల్గొన్నారు.

రైటర్ బ్రహ్మయ్యపై డీఎస్పీ విచారణ

అద్దంకి రూరల్: అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బ్రహ్మయ్యపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం విచారణ జరిగింది. స్టేషన్‌లో చీరాల డీఎస్పీ నాయక్ విచారణ చేపట్టినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

గోవుల కష్టాలు దేవుడికెరుక !

- గోవులను వదిలేస్తున్న యజమానులు
- రహదారులపైనే విశ్రమిస్తున్న వైనం
- ప్లాస్టిక్ వ్యర్థాలను తిని అనారోగ్యంపాలు
- గోవుల దాడిలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు

వేటపాలెం: గోమాతలో సకల దేవతలు కొలువై ఉంటారని హిందువుల నమ్మకం. గోవును పూజిస్తే సకల దేవతలను ఆరాధించిన పుణ్యం లభిస్తుందని పెద్దలు చెప్తుంటారు. పురాణాల్లో కూడా గోవులకు ఎంతో విశిష్టత ఉంది. అలాంటి గోవులను కొందరు యజమానులు దేవుడి ఆవులుగా రోడ్లపైకి వదిలేస్తుండటంతో నరకయాతన అనుభవిస్తున్నాయి. ఆవుల పోషణ భారం మీద పడకుండా మండల పరిధిలోని కొందరు వాటిని రోడ్ల పైకి వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని రోజుల తర్వాత అవి ఈనితే అప్పుడు మళ్లీ ఇంటికి తీసుకెళ్లి పాలు పితుక్కొని వదిలేస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో, చీరాల–వేటపాలెం ప్రధాన రహదారిలో కూరగాయల మార్కెట్, దేశాయిపేట, రామానగర్, నూలుమిల్లు సెంటర్ తదితర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా దాదాపు 50కు పైగా ఉంటాయి. వీటికి రహదారులే పశువుల పాక, రోడ్డు పక్కన గుంతల్లో నీటితోనే దాహం తీర్చుకుంటున్నాయి. ఎవరి ఇంటి ముందుకైనా వెళ్లే వారు పెట్టే దోసెడు బియ్యం, జొన్నలు, ధాన్యమే వాటికి దిక్కు. పచ్చని గడ్డి రుచి చూసే భాగ్యం వాటికి లేదు. ఆహారన్వేషణలో ఊరంతా తిరిగి అలసిన ఆవులు రహదారులపై ఎక్కడ పడితే అక్కడ పడుకుండిపోతాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు అవి పొడిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. చివరకు ఎక్కడ పడితే అక్కడ దూడలకు జన్మనిస్తూ వాటి పరిరక్షణ, వైద్యం కరువై నరకం అనుభవిస్తున్నాయి.


చీరాల-వేటపాలెం ప్రధాన సెంటర్‌లో రోడ్డుపై ఉన్న గోవులు

ప్రమాదాల బారిన వాహనదారులు..

ప్రధాన రహదారిపై రాత్రి వేళల్లో అడ్డుగా గోవులు పడుకున్న సమయాల్లో ద్విచక్రవాహనదారులు అనేక పర్యాయాలు ప్రమాదాలబారిన పడ్డారు. రెండు నెలల కిందట ఆటోకు అకస్మాత్తుగా గోవు అడ్డుగా రావడంతో ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఇటీవల రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న గోవులు గమనించకుండా ద్విచక్రవాహనదారులు గోవును ఢీకొట్టడంతో అటు గోవుతో పాటు బైక్‌పై వెళుతున్న ఇద్దరు గాయాలపాలయ్యారు. రెండు రోజుల కిందట రామ్‌నగర్ దగ్గరలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ఆవు కింద పడేసి పొడవడంతో తీవ్రగాయాలై ఆసుపత్రిపాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు గోవుల యజమానులు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి గోవులను రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేని పక్షంలో రోడ్లపై తిరిగే గోవులను గోసంరక్షణ శాలలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గోశాలలో వదిలేయాలి..



దేవుని ఆవులంటూ కొందరు యజమానలు గోవులను రోడ్లపైకి వదిలేయడం మంచి పద్ధతి కాదు. ఇలా పశువులు విషపూరిత వ్యర్థాలు తిని ప్రాణం మీదకు తెచ్చుకుంటుంటాయి. రోడ్లపై పడుకోవడం, రోడ్లపై తిరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. యజమానులకు అవగాహన కల్పించి అప్పగించాలి. ఎవరూలేనివని తేలితే సమీపంలోని గో సంరక్షణ శాలకు తరిలించాలి.

– బండ్ల తిరుమలాదేవి, జెడ్పీటీసీ సభ్యులు, వేటపాలెం


వేటపాలెంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శర్మ


స్వర్ణలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


అంబడిపూడిలో వ్యర్థాల తొలగింపు

పారిశుద్ధ్య కార్యక్రమాలు మొదలు

సాక్షి ఎఫెక్ట్..

బల్లికురవ: సీజనల్ జ్వరాలు వ్యాధులు సోకకండా సోమ, మంగళవారాల్లో మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 6న పడకేసిన పారిశుద్ధ్యం– మంచం పట్టిన పల్లెలు అనే శీర్షికతో పెద అంబడిపూడి, చిన అంబడిపూడి గ్రామంలో సర్పంచ్ కుసుముమారి, సెక్రటరీ కేవీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మురుగు వ్యర్థాలను తొలగించారు. ట్రాక్టర్‌తో వీధుల వెంట ఎబేట్ పిచికారితోపాటు దోమ నిర్మూలను ఫాగింగ్ చేపట్టారు. గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. మేలైన సమాజమే లక్ష్యం కావాలని ఎంపీడీఓ వై. హనుమారెడ్డి, ఈవోఆర్డీ సుమతి, సర్పంచ్‌లు సెక్రటరీలకు సూచించారు.


అంబడిపూడిలో ఫాగింగ్

ఇంటింటి ఫీవర్ సర్వే పరిశీలన..

స్వర్ణ (కారంచేడు)/చినగంజాం: వాతవరణంలో ఉన్న మార్పులతో వ్యాపిస్తున్న అంటువ్యాధులు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలను గుర్తించేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా చెయ్యాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ, కొడవలివారిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలను ఆమె పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు ప్రధానంగా కాచి కల్లార్చిన నీటిని తాగాలని, వాడి పడేసిన టైర్లు, పూలకుండీలు, టీ కప్పులు, కొబ్బరిబోండాలను పరిసర ప్రాంతాల్లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట హెచ్ఈ మీనాకుమారి, హెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, స్థానికులు పాల్గొన్నారు.

– పెదగంజాం గ్రామపంచాయతీ కోడూరివారిపాలెంలో విషజ్వరాలతో బాధపడుతున్న రోగులను అధికారులు పరిశీలించారు. నీలాయపాలెం గ్రామంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించి వెంటనే వినియోగంలోనికి తీసుకొని రావాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం..

వేటపాలెం: మండల పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శర్మ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటిని క్లోరినైజ్ చేసి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామ రెవెన్యూ అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు ఆక్రమణలు కాకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్ పి.సురేష్‌బాబు సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో చీరాల అర్బన్, రూరల్ గ్రామాల్లోని వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములు, స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని వార్డులు, గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం కాకుండా చూడటంతో పాటుగా ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే వారి నుంచి భూమిని ప్రభుత్వానికి ఆదీనం చేయాలన్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరుగుతున్నాయనే నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వీఆర్వో వారికి కేటాయించిన గ్రామాలు, వార్డుల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలన చేసి ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు.

కర్రతో మహిళపై దాడి

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండపాలెంలో ఇంటిలో ఉన్న దివ్యాంగురాలైన మహిళపై దాడి జరిగిన సంఘటనపై మంగళవారం ఏఎస్సై సైదయ్య కేసు నమోదు చేశారు. శింగరకొండ పాలెంలో నివాసం ఉంటున్న దివ్యాంగురాలైన దాచేపల్లి నాగమల్లేశ్వరిపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో కర్రలతో దాడి చేశారు. బాధితురాలు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేసింది.

బైక్ అపహరణ

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని నామ్ రహదారి పక్కన హోటల్ వద్ద ఉంచిన బైకు ఈనెల 16న అపహరణకు గురైన సంఘటనపై బాధితుడు మంగళవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏఎస్సై సైదయ్య కేసు నమోదు చేశారు. ఏఎస్సై వివరాల మేరకు.. బల్లికురవ మండలం కొప్పరపాడు గ్రామానికి చెందిన షేక్ నాగూర్ వలి పరదాలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నామ్ రహదారి పక్కన ఉన్న తాజ్ హోటల్ వద్ద బైకు ఉంచి బయటకు వెళ్లి సాయంత్రానికి వచ్చేసరికి బైకు కనబడలేదు.

సమాఖ్య లక్ష్యం చేరుకోవాలి

మేదరమెట్ల: ఈఏడాది ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజస్ పథకం ద్వారా కొరిశపాడు మండలంలోని మహిళా సమాఖ్యకు 242 లక్ష్యంగా ఇచ్చామని ఏపీఎం అనూరాధ అన్నారు. కొరిశపాడు మండల సమాఖ్య వీఓఏలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రూ.5 లక్షల లోపు 41 మందికి మిగిలిన 201 మందికి రూ.5లక్షల వరకు రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

బాలగంగాధర్ తిలక్ సేవలు మరువలేనివి


బాలగంగాధర్‌కు నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

మార్టూరు: స్వరాజ్యం నా జన్మ హక్కు అంటూ నినదించిన స్వాతంత్ర సమరయోధుడు, లోకమాన్య బాలగంగాధర తిలక్ జయంతి వేడుకలను మంగళవారం మార్టూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎఫెక్ట్ కార్యాలయంలో మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మాదాల సాంబశివరావు, ఇతర ప్రతినిధులు తాళ్లూరి సాంబశివరావు, కొర్రపాటి ఖాజారావు, షేక్ ఖాజా హుస్సేన్, రావి అంకమ్మ చౌదరి, బసవరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

చీరాల రూరల్: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థికి దాతలు ఆర్థిక సాయమందించారు. చీరాల హైస్కూల్ ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటిలో ఉచిత సీటు సాధించిన విద్యార్థిని హేమలక్ష్మికి చదువు నిమిత్తం సాయాన్ని మంగళవారం అందించారు. కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదువుకుని ట్రిపుల్ ఐటీలో ఉచిత సీటు సాధించిందన్నారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ళ గురుప్రసాద్, గొడవర్తి సుధాకర్, గుర్రం బదరీనాథ్, వలివేటి మురళీకృష్ణ, కె.వీరాంజనేయులు, సురేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్

రోటరీతో విద్యాభివృద్ధి


నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాతలు, రోటరీ సభ్యులు

అద్దంకి: విద్యాభివృద్ధికి రోటరీ చేయూత ఇస్తూనే ఉంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు వీరయ్య అన్నారు. మంగళవారం విద్యార్థులకు 7 వేల రూపాయల విలువ చేసే నోట్ పుస్తకాలను అందించారు. అలాగే పెన్నులు, బిస్కెట్లు, డెటాల్ హ్యాండ్ వాష్ సీసీలు పంపిణీ చేశారు. కొల్లిపర నాగయ్య, మలాది శ్రీనివాసరావు సమకూర్చారు. వీరయ్య మాట్లాడుతూ స్నేహం, సేవా, సహకారం అనే సూత్రాలతో రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో పని చేస్తుందని చెప్పారు. అనంతరం దాత కొల్లిపర నాగయ్యను సన్మానించారు. కార్యక్రమములో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకర్ రావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, కొల్లిపర నాగయ్య, తాళ్లూరి బాబురావు, హెచ్ఎం విజయభాస్కర్, విద్యా కమిటీ చైర్మన్ చందు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి


సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తి రెహానా

చీరాల రూరల్: నూతన న్యాయ చట్టాల మేరకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేసినట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి రెహానా మాట్లాడుతూ మోటారు సైకిళ్లు నడిపే విద్యార్థులంతా విధిగా హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపల్ డి. జగదీష్, రూరల్ సీఐ సత్యనారాయణ, ఎంఈఐ బి. రామకృష్ణారెడ్డి, ఈపురుపాలెం ఎస్సై ఎం. శివకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

చీరాల: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన ఘటన మంగళవారం చీరాలలో చోటుచేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. ఉజిలిపేటకు చెందిన తరుణ్ అనిల్‌పై అదే కాలనీకి సాయి, ఈశ్వరి, సారిక ముగ్గురు పాత గొడవల నేపథ్యంలో సీసాతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన బాధితుడి వద్ద నుంచి అవుటుపోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వెంకటేష్

చీరాల: వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం పార్టీ నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ జగనన్నకు చీరాల నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు. ధర్నాను ఉద్దేశించి వెంకటేష్‌కు జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.


మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

మైనర్ కాలువలో చిల్లచెట్లు తొలగించండి

జె.పంగులూరు: కోటపాడు మైనర్ కాలువలో ఉన్న ముళ్ళ చెట్లను వెంటనే తొలగించి కాలువ మరమ్మతులు చేయాలని, సాగునీటి పారుదలకు ఆటంకం లేకుండా చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులు లేకుండా సాగర్ కాలువ ఉండటంపై విస్మయం వ్యక్తం చేశారు. కోటపాడు మైనర్ కాలువను పంగులూరు మండల రైతు సంఘం నాయకులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు మాట్లాడుతూ కోటపాడు మైనర్ కాలువలో గత ఆరు సంవత్సరాల నుంచి ముళ్ల చెట్లు పెరిగి పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఈ కాలువ కింద కొండమంజులూరు, కోటపాడు, కల్లంవారిపాలెం, చిన్నమల్లవరం, పంగులూరు, చందలూరు, గ్రామాలకు చెందిన భూములున్నాయని, గతంలో ఈ ప్రాంతమంతా మాగాణి సాగు చేసేవారన్నారు. ఇప్పుడు ఆరుతడి పంటలు వేస్తున్నారని, అయితే ఆ పంటలకు కూడా సాగు నీరు అవసరం ఉందని తెలిపారు. సకాలంలో సాగు నీరు రాకపోవటం వలన గతంలో మిర్చి, మొక్క జొన్న పంటలు దెబ్బతిని, రైతాంగం నష్టపోయి విషయాన్ని గుర్తు చేశారు. ఆరు తడి పైర్లకు సైతం నీరందించే విధంగా కాలువ మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలువలో ఉన్న ముళ్ల చెట్లు, కాలువ గట్లపై ఉన్న ముళ్ళ చెట్లను వెంటనే అధికారులు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు బాచిన ఆంజనేయులు, దొప్పలపూడి పూర్ణయ్య, చింతల బాపనయ్య, సాధినేని ప్రసాద్, పాల్గొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఏఎన్‌యూ దూరవిద్య డైరెక్టర్‌గా వంకాయలపాటి

కారంచేడు: నాగార్జున విశ్వవిద్యాలయంలో సోషియాలజీ, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా, డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీగా విధులు నిర్వహిస్తున్న వంకాయలపాటి వెంకటేశ్వర్లుని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా నియమితులు కావడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం అదే యూనివర్శిటీలో డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రావు చైర్ పరిశోధకులు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో యూపీ పాఠశాలలో నిర్వహించిన ఈఅభినందన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాస్టారు చేసిన సేవా కార్యక్రమాలను అభివర్ణించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కారంచేడు గ్రామానికే పేరు, ప్రఖ్యాతలు తీసుకొచ్చిన డాక్టర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు మన గ్రామ వాసి అవ్వడం మనందరి అదృష్టంగా భావించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో జీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖమండప నిర్మాణానికి విరాళం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి వితరణ లభించింది. బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన కుమ్మకి వెంకట్రావు, పద్మ రూ. 1,50,000 మంగళవారం అందజేసినట్లు దేవాలయ ఏసీ సుభద్ర తెలిపారు.

సాగర్ నీటితో చెరువులు నింపండి

జె.పంగులూరు: సాగర్ కాలువల ద్వారా వచ్చే నీటిని గ్రామాల్లో ఉన్న తాగునీటి చెరువులను నింపుకోవాలని ఎన్ఎస్‌పీ ఈఈ ఉమామహేశ్వరరావు కోరారు. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా చెరువులు నింపాలని సిబ్బందిని కోరారు. పల్నాడు జిల్లాలోని 18వ మైలు రాయి వద్ద నుంచి మంగళవారం ఆయన సాగర్ కాలువను పరిశీలిస్తూ కొనంకి సబ్ డివిజన్‌కు వచ్చారు. 37వ మైలు రాయి అయిన రామకూరు దగ్గర ప్రస్తుతం పమిడిపాడు మేజర్, యద్దనపూడి మేజర్లకు 378 క్యూసెక్కులు నీరు వస్తున్నాయని, రేపటికి ఈ నీటి ప్రవాహం మరింత పెరగవచ్చని తెలిపారు. సోమవారం నీటి ప్రవాహం ఎక్కువగా ఉండగా, మంగళవారం కొంత తగ్గిందని, అయితే బుధవారానికి కొంత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం నీరు వృథా కాకుండా చూడాలని, కోటపాడు, ద్రోణాదుల, నూతలపాడు మైనర్లతో పాటు, పమిడిపాడు మేజర్ కాలువ పరిధిలోని ఉన్న మంచినీటి చెరువులన్నింటినీ నింపాలని కోరారు. డివిజన్లు ఉన్న కాలువల పరిస్థితి పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ కొనంకి సబ్ డివిజన్ డీఈ స్వామి జేఈలు బాలకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.


రామకూరు దగ్గర కాలువను పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ ఈఈ ఉమామహేశ్వరరావు

కారంచేడులో నేత్రదానం



కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో గోడ మూలబజారుకు చెందిన యార్లగడ్డ శ్రీరాములు భార్య యార్లగడ్డ లక్ష్మీదేవమ్మ (86) మంగళవారం తెల్లవారుజామున 1గంటకు మృతి చెందింది. మంగళవారం కుటుంబ సభ్యులు అందించిన సమాచారంతో గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ నేత్రాలయంకు చెందిన డాక్టర్ సిద్ధార్థ బృందం ఆమె నేత్రాలు (రెటీనా)ను సేకరించుకువెళ్లారు. కారంచేడు గ్రామంలో ఇది 35వ నేత్రదానంగా నమోదు అయ్యింది. నేతదానానికి సహకరించిన లక్ష్మీదేవమ్మ కుమారులు యార్లగడ్డ రామమ్మూర్తి, యార్లగడ్డ వెంకన్న, యార్లగడ్డ కోదండరామయ్యలను గ్రామస్తులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన బ్లడ్‌అండ్‌ఐ డోనేషన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చదువులో తల్లిదండ్రుల పాత్ర గొప్పది

అద్దంకి: అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని ఎంఈఓ 2 సుధాకర్ అన్నారు. జాతీయ విద్యా విధానం (యన్‌ఈపీ)– 2020 ప్రవేశపెట్టిన అనంతరం 4వ వార్షికోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా విద్యా శాఖాధికారి.. సమగ్ర శిక్ష ఏపీసీ సూచనల మేరకు మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తిమ్మాయపాలెం (ఏఏ)లో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ ఇ. గంగాధరరావు, హెచ్ఎం ఎం. సర్వేశ్వరరావు ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ యం. రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com